ప్రభాతవార్త
కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 17 నవంబర్ 2026

నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



సిద్ధవటం, నవంబర్16, ప్రభాతవార్త:
సిద్ధవటం మండలంలోని మాధవరం1 క్లస్టర్ పరిధిలో సోమవారం ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ షెల్కె నిచికేత్ విశ్వనాథ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తును, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ల దాఖలుకు వస్తున్న అభ్యర్థులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎస్పీ వెంట పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ఆర్టీసీ డీఎం సుబ్బమ్మ



జమ్మలమడుగు, నవంబరు 16, ప్రభాతవార్త:
కార్తీక మాసం సందర్భంగా శివ భక్తులకు జమ్మలమడుగు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం సుబ్బమ్మ వెల్లడించారు. ఈ కార్తీక మాసంలో శివ క్షేత్రాలకు వెళ్లే ప్రయాణికుల కోసం జమ్మలమడుగు నుంచి అగస్తీశ్వర కోన, కన్యతీర్థం బాలప్పకోన, శ్రీశైలం మహానంది యాగంటి అలాగే కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని అరుణాచలానికి స్పెషల్ బస్సులు నడపడం జరుగుతఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. జమ్మలమడుగు–శ్రీశైలం రూ.445, జమ్మలమడుగు కన్యతీర్థం రూ.30, జమ్మలమడుగు - అగస్త్యేశ్వర కోనకు రూ.40 ఛార్జి ఉంటుందన్నారు.

హర..హర.. మహాదేవ..శంభో శంకర..

మొదటి కార్తీక సోమవారంతో క్రిక్కిరిసిన శైవ క్షేత్రాలు

భక్తులతో పోటెత్తిన పొలతలఅతిరాలలో ఘనంగా గంగాహారతి





రాజంపేట, నవంబర్ 16 ప్రభాతవార్త:
పవిత్ర కార్తీకమాసంలో మొదటి సోమవారం కావడంతో శివ క్షేత్రాలు కిటకిటలాడాయి. పంచాక్షరి మంత్రంతో మార్మోగాయి. జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలు పొలతల, నిత్య పూజ కోన,అత్తిరాల త్రేతేశ్వర ఆలయం, గుండ్లూరు అగస్తేశ్వర ఆలయం భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుంచి శివ నామ స్మరణతో క్రిక్కిరిసాయి. సాయంత్రం నుంచి శివాలయాలు కార్తీక దీపాల వెలుగులతో నిండాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించారు. మరోవైపు కేదారేశ్వర వ్రతాలను ఆచరించారు. రాజంపేట పట్టణంలోని శివాలయంలో రామలింగేశ్వర స్వామిని ఆలయ అర్చకులు చోర గుడి రామలక్ష్మణ స్వామి ప్రత్యేక అలంకరణ చేశారు. అత్తిరాల త్రేతేశ్వర స్వామికి తెల్లవారుజామునే పంచామృత అభిషేకలను చేశారు. మొదటి కార్తిక సోమవారాన్ని పురస్కరించుకొని అత్తిరాలలో గిరిప్రదక్షిణ మండలి ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ కార్యక్రమానికి శివ భక్తులు పోటెత్తారు. హర హర మహాదేవ శంభో శంకర అంటూ శివుని స్తుతించారు. అనంతరం బాహుద నది తీరంలో గంగ హారతిని వేద పండితుల సమక్షంలో నిర్వహించారు. కార్తీక మాసంలో నిర్వహించిన గంగాహారతికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

అక్రమ మైనింగ్, పన్నులు ఎగవేతపై

చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ ఆదాయ లక్ష్య సాధనకు కార్యాచరణ

జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్



మదనపల్లె, నవంబర్ 16 ప్రభాతవార్త :
అక్రమ మైనింగ్, పన్నుల ఎగవేతపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో నిర్వహించిన ఆదాయార్జనశాఖల సమిక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆదాయ వసూళ్లను మెరుగుపరిచి 2026-27 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. కమర్షియల్ ట్యాక్స్ శాఖ ద్వారా ఏడాదికి ఇప్పటి వరకు జీఎస్‌టి వసూళ్ళు రూ.108.91కోట్లు నమోదు అయ్యాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో జీఎస్‌టి బకాయిల వసూళ్లకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రవాణశాఖలో ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు రూ.68.58కోట్లు ఆదాయం వచ్చిందని వివరించారు. పన్నులు చెల్లించని వాహనాలను గుర్తించి బకాయిలు వసూళ్ళు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్సైజ్‌శాఖపై సమీక్షిస్తూ మద్యం దుకాణాలు, బార్లలో ఏర్పాటు చేసిన సిసి టివి కెమరాలు సక్రమంగా పనిచేస్తున్నాయోలేదో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి జిల్లాలోకి అక్రమంగా మద్యం రవాణ కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను పెంచాలన్నారు. ఘనులశాఖల వార్షిక లక్ష్యాల సాధనకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ మైనింగ్ ఖనిజ ఆదాయంకు సంబంధించి కేసులు నమోదు చేయాలన్నారు. అనుమతులు లేకుండా ఖనిజాలు తవ్వకాలు, రావాణకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటిలు, గ్రామ పంచాయితీల పరిధిలో ఆస్థిపన్ను, ఇంటిపన్ను, ఖాళీస్థలాల పన్ను, ట్రేడ్‌లైసెన్స్, భవన నిర్మాణ అనుమతులు ఫీజులు వసూలు చేయాలన్నారు. అనంతరం నీటి సంరక్షణ, భూగర్భజలాల అభివృద్ధిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తల పై

వైసిపి అల్లరి మూకలు దాడి

కారు ధ్వంసం

టిడిపి కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదు

మంత్రి రాంప్రసాద్ రెడ్డి



రామాపురం, నవంబర్ 16, ప్రభాతవార్త :
రామాపురం మండలంలో 13 గ్రామపంచాయతీలో ప్రశాంతంగా సర్పంచ్ వార్డుల నామినేషన్లు జరుగుతుంటే వైసిపి అల్లరి ముకలు సుద్దమల్ల గ్రామపంచాయతీలో సోమవారం టిడిపి కార్యకర్తలపై దాడి చేసి వాహనాలను ధ్వంసం చేశారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆరోపించారు. వైసిపి నీచ సంస్కృతికి ఇది పరాకాష్ట అనే ఆయన ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి సొంత ఊరులో పులివెందుల, పుంగనూరు, బెంగళూరు పరిశ్రమ ప్రాంతాల నుండి వందలాది మంది అల్లరి మూకలను తీసుకువచ్చి తెలుగుదేశం కార్యకర్తలపై వారి వాహానాలపై దాడులు చేయించారని ఆయన ఆరోపించారు మా కార్యకర్తలను భయపెట్టాలని చూస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని నీ విష సంస్కృతిని ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు.

కార్తీక సోమవారం సందర్భంగా భీమేశ్వర స్వామి ఆలయానికి

పోటెత్తిన భక్తులు




మైదుకూరు, నవంబర్ 16,ప్రభాతవార్త:
:కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా మైదుకూరు పట్టణంలోని పాతూరులోవెలసిన శ్రీలక్ష్మీ మాధవరాయ, ఆంజనేయ స్వామి, భీమేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల సందడి నెలకొంది. సోమవారం ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు ఆలయాన్ని సందర్శించి స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ముఖ్యంగా సాయంత్రం సంధ్యా సమయంలో నిర్వహించిన ఆకాశదీపం వెలిగించే కార్యక్రమానికి భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తిశ్రద్ధలతో ఆకాశ దీపాన్ని వెలిగించి కార్తీక మాస విశిష్టతను చాటుకున్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మైదుకూరు మున్సిపాలిటీలో 22వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైన గోవిందిన్నె కల్పన పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. స్థానిక మహిళలు, ఆలయ పెద్దలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.కార్తీక సోమవారం సందర్భంగా ఆలయంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



శ్రీ రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధికి


దాతల చేయూత

ఆలయ అభివృద్ధికి లక్ష రూపాయలతో విద్యుత్ దీపాల ఏర్పాటు



పులివెందుల, నవంబర్ 16 ప్రభాతవార్త :
పులివెందుల పట్టణంలోని పురాణ ప్రసిద్ధి చెందిన శ్రీ రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు ముందుకొచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని ఆలయ నిర్వా హకులు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన లక్ష్యంగా దాతలు చేపట్టిన సేవా కార్యక్రమాలు ప్రశంసనీయంగా నిలిచాయి.ఈ సందర్భంగా ఆలయ ప్రహరీ గోడ చుట్టూ విద్యుత్ పైపులైన్ ఏర్పాటు చేసి, ఎల్ఈడీ దీపాల నిర్మాణానికి సుమారు రూ.లక్ష వ్యయంతో పనులు చేపట్టారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణం, ప్రధాన రహదారికి ఇరువైపులా సుందరీకరణ పనులు, పరిసరాల్లో జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం వెలుపల ప్రహరీ గోడ చుట్టూ పెరిగిన కంపచెట్లు, ఇతర అవాంఛనీయ నిర్మాణాలను తొలగించేందుకు కూడా చర్యలు చేపట్టారు.ఈ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీశైలం దేవస్థానం మాజీ సభ్యుడు గువ్వల గంగాధర్, రిటైర్డ్ డీఈ సుధాకర్ రెడ్డి, ఏపీజీబీ రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ జూటూరు గంగిరెడ్డి, రాముట్లపల్లె తుమ్మలూరు కరుణాకర్ రెడ్డి, అపోలో టైర్స్ అధినేత కుమ్మేత గురువిరెడ్డి, భారతి సిమెంట్ డీలర్ గజ్జల జగన్మోహన్ రెడ్డి, సుబ్బయ్య షాపు నిర్వాహకులు చల్ల రమణ, రిటైర్డ్ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు పెద్దపల్లి శ్రీనివాసులు, శ్రీ చైతన్య కళాశాలల అధిపతి ఆరవేటి నారాయణరెడ్డి, శ్రీ రంగనాథ ట్రస్ట్ సీఈఓ అల్లం రంగనాయకులు రాయల్ తదితరులు సహకారం అందించారు.ఆలయ అభివృద్ధికి విశేషంగా సహకరించిన దాతలను ఆలయ ఈవో కె.వి. రమణ, ప్రధాన అర్చకులు తలముడిపి నవీన్ కుమార్ శర్మ ప్రత్యేక పూజలతో సత్కరించారు. అనంతరం దాతలకు స్వామివారి చిత్రపటాలు, తీర్థప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని దాతల సేవలను అభినందించారు.

కార్తీక శోభ.. శివక్షేత్రాలకు భక్తుల వెల్లువ



పులివెందుల, నవంబర్ 16 ప్రభాతవార్త :
కార్తీక మాసం తొలి వారం సోమవారం సందర్భంగా పులివెందుల పట్టణం, పరిసర ప్రాంతాల్లోని శివక్షేత్రాలు భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. కార్తీక మాసంలో శివారాధనకు విశేష ప్రాధాన్యత ఉండటంతో పాటు సోమవారం పరమశివుడికి అత్యంత ప్రీతికరమైన రోజుగా భావిస్తుండటంతో తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయాలకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, యువతీ యువకులు కుటుంబ సమేతంగా ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పులివెందుల పట్టణంలోని ప్రసిద్ధ మిట్ట మల్లేశ్వర స్వామి దేవస్థానంతో పాటు నామాల గుండు, భైరవేశ్వర కోన, గవి మల్లేశ్వర కోన, పంచలింగాల కోన, శనీశ్వర కోన, భానుకోట తదితర శైవ క్షేత్రాలు భక్తులతో సందడిగా మారాయి. ఉదయం నుంచే ఆయా ఆలయాల వద్ద భక్తుల రాకపోకలు పెరగడంతో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు పవిత్ర భావంతో ఆలయాలకు చేరుకుని పరమశివుడికి జలాభిషేకాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. తమ కుటుంబాలు సుఖసంతో షాలతో ఉండాలని, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని స్వామివారిని ప్రార్థించారు.

వైభవంగా మహాశివుని విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



బద్వేల్ అర్బన్ నవంబర్ 16 ప్రభాతవార్త :
బద్వేల్ పట్టణంలో పడమర దిశన ఉన్న అనంతగిరి కొండమీద ఓంకార క్షేత్రము వెలసి ఉన్నది. కార్తీక మాసం ఉత్సవాల సందర్భంగా మొదటి కోటి సోమవారం రోజున ఓంకార క్షేత్రంలో ధ్యానముద్రలో ఉన్న పరమశివుని విగ్రహ సంప్రోక్షణ ఆవిష్కరణ మహోత్సవము వేద పండితులు కనుమల్ల సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించబడినది. పూజా కార్యక్రమంలో విగ్రహ దాతలు సతీమణి పంగా వెంకటసుబ్బమ్మ వీరి అల్లుడు డా ॥ కే .వెంకట సుబ్బారెడ్డి ధర్మపత్ని సౌజన్య లక్ష్మి మరియు మన్యం విజయలక్ష్మి వీరి కుమారుడు మన్యం గౌతంరెడ్డి సతీమణి శ్వేత మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఉదయం 9 గంటల నుండి గణపతి పూజ స్వస్తివాచనం కలశ స్థాపనం విశేష అభిషేకం లక్ష్మీ గణపతి హోమం రుద్ర స్వాహాకార హోమం నవగ్రహ వాస్తు హోమం పూర్ణాహుతి మహాదార్వచనములు నిర్వహించబడినవి. ఈ కార్యక్రమానికి బద్వేలు మరియు పరిసర ప్రాంతాలలోని హిందూ బంధువులందరూ తండోపతండాలుగా విచ్చేసి ధ్యానముద్రలో ఉన్న శివయ్యను దర్శించుకున్నారు. విగ్రహావిష్కరణ అనంతరం కార్తీక హిందూ వనభోజన మహోత్సవం సందర్భంగా 12 గంటల నుండి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ ఓంకార క్షేత్రాన్ని సందర్శించిన భక్తులు అక్కడి ప్రకృతి రమణీయతను ఆధ్యాత్మిక ప్రదేశమును తిలకించి తన్మయత్వం చెందారు. ఈ కార్తీకమాస ఉత్సవాలు శ్రీ ఓంకార క్షేత్రం అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.

పంచాయతీ ఎన్నికలకు టిడిపి

శ్రేణుల సన్నద్ధం

గ్రామాల్లో రఘునాథ్ రెడ్డి, రవితేజ రెడ్డి విస్తృత పర్యటన

కూటమి నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల సన్నద్ధతపై చర్చ



వేంపల్లి, నవంబర్ 16, ప్రభాతవార్త.
పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అలవలపాడు, రామిరెడ్డిపల్లె, ముతుకూరు, నాగూరు గ్రామాల్లో టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రవితేజ రెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశమై గ్రామాల వారీగా పార్టీ పరిస్థితులు, ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలియజేశారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కూటమి విజయానికి కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ జగన్నాథ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, నాయకులు బాలస్వామి రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, గౌస్ బాబా, దక్కా రమేష్, మడక శ్రీను, మారుతి, గంగాధర్ రెడ్డి, అహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో

అవినీతి పర్వం!

ప్రిన్సిపాల్ వ్యాఖ్యలను ఖండించిన అధ్యాపక, బోధనేతర సిబ్బంది



మదనపల్లెక్రైం, నవంబర్ 16, ప్రభాతవార్త.
జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తమపై చేసిన ఆరోపణలు నిరాధారమని, కళాశాలలో భారీగా అక్రమాలు జరుగుతున్నాయని సిబ్బంది ఆధారాలతో సహా వెల్లడించారు. సోమవారం సిబ్బంది విలేకరులతో మాట్లాడుతూ వస్తువులు అందకముందే 2025 డిసెంబరులోనే బ్యాగులు, బెడ్‌షీట్లకు పూర్తి బిల్లులు చెల్లించిన సకాలంలో రాకపోవడంతో, కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా బ్యాగులు తెప్పించారన్నారు. ఇంకా బెడ్ షీట్లు రాకపోవడంతో ఈ విషయమే సిబ్బంది విలేకర్ల కు సమాచారం ఇవ్వగా విలేకరులు వస్తున్నారని తెలిసి సోమవారం హడావుడిగా బెడ్‌షీట్లు తెప్పించారన్నారు. యూనిఫాంలు, సామగ్రి కొనుగోలుకు అర్హత లేని సంస్థల నుంచి నకిలీ కొటేషన్లు తెప్పించి నచ్చిన వారికే టెండర్లు కట్టబెట్టడం, పనిచేయని జనరేటర్ల మరమ్మతులు, డీజిల్ పేరిట అక్రమంగా బిల్లులు డ్రా చేశారన్నారు. ప్రభుత్వమే డైట్ ఛార్జీలు చెల్లిస్తున్నా, ప్రిన్సిపాల్ విద్యార్థుల నుంచి అక్రమంగా రూ. కోటికి పైగా వసూలు చేశారని, ఆ సొమ్ము వెనక్కి ఇవ్వాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్న ప్రిన్సిపాల్ పట్టించుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. నకిలీ ప్రొసీడింగ్స్ సృష్టించి సిబ్బందిపై నెపం నెట్టడం, నవంబరు 14న చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్) లేకుండానే పరీక్ష నిర్వహించడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరారు.


పాత కక్షలతో యువకుడిపై కత్తితో దాడి



మదనపల్లెక్రైం, నవంబర్ 16 ప్రభాతవార్త.
కురబలకోట మండలం అంగళ్లు కమతంపల్లెకు చెందిన సి. విశ్వనాథ్ (38) పై సోమవారం రాత్రి ప్రత్యర్థి కత్తి(బీరుబాటిల్) తో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితుడి కథనం ప్రకారం, విశ్వనాథ్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఏడాది క్రితం అంగళ్లు లో తన బంధువులతో నల్ల చంద్ర గొడవ పడుతుండగా విశ్వనాథ్ అడ్డుకున్నాడు. అప్పటి నుంచి ఆ విషయాన్ని మనసులో పెట్టుకుని కసి పెంచుకున్న మొలకవారిపల్లికి చెందిన నల్ల చంద్ర, ప్రతీకారంగా అంగళ్లులో వారం క్రితం కూడా గొడవ పడ్డాడు. ఇదిలా ఉంటే ఒంటరిగా ఉన్న విశ్వనాథ్‌పై కత్తితో దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో విశ్వనాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కురబలకోట 108 సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన విశ్వనాథ్‌ను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఫ్లైఓవర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం..

విద్యార్థి మృతి



పీలేరు, నవంబర్ 16, ప్రభాతవార్త:
పీలేరు–మదనపల్లె-కడప రోడ్డు ఫ్లైవర్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ విద్యార్థి ఘటనాస్థలంలోనే మృతి చెందాడు.మృతుడిని కిరణ్‌గా గుర్తించారు. తాను శ్రీ మేధా జూనియర్ కళాశాలలో చదువుతున్నట్లు సమాచారం. మృతుడి స్వగ్రామం తిరుపతి జిల్లా, చిన్నగొట్టిగల్లు మండలం, బాకరావుపేటగా తెలుస్తోంది. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన అనంతరం ఆగకుండా వెళ్లిపోయినట్లు సమాచారం.విద్యార్థి మృతితో స్థానికంగా విషాదం నెలకొంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నామినేషన్ ప్రక్రియను అడ్డుకుంటే చర్యలు తప్పవు

సిఐ సురేష్ రెడ్డి

వార్త 2వ పేజీలో

వైష్ణవి దేవి ఆలయంలో ఘనంగా 3వ వార్షికోత్సవ వేడుకలు



చౌడేపల్లి, నవంబర్ 16, ప్రభాతవార్త:
చౌడేపల్లి మండలం పుదీపట్ల స్వయంభు శ్రీ వైష్ణవి దేవి ఆలయ 3వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకురాలు శ్రావణి తెల్లవారుజామునే వైష్ణవి దేవితో పాటు అభయాంజనేయ స్వామి, నాగభైరవ స్వామి వార్లకు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను రంగురంగుల పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రామసముద్రం, పుంగనూరు, మదనపల్లె, చౌడేపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారి సన్నిధిలో భక్తులు సామూహిక సౌందర్యలహరి, విష్ణు సహస్రనామ, ఖడ్గమాల పారాయణాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త వినోద్ కుమార్ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించాలి

రెండు రోజుల పాటు రైతులకు శిక్షణ..

బత్తాయి, పచ్చిమిరప పంటల్లో క్షేత్రస్థాయి అవగాహన



ముద్దనూరు, నవంబర్ 16, ప్రభాతవార్త:
రైతులు సాగు చేస్తున్న పంటల్లో చీడపీడల నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటిస్తూ, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ముద్దనూరు మండల పరిషత్ కార్యాలయంలో విజయవాడ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఏడీఏ కె.వీరయ్య చౌదరి, కేవీకే అధిపతి డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ రసాయనిక పురుగుమందుల విచ్చలవిడి వినియోగాన్ని తగ్గించి జీవ నియంత్రణ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఫాస్ఫో బ్యాక్టీరియా, సూడోమోనాస్, ట్రైకోడెర్మా విరిడీ, వేపనూనె వినియోగం, లింగాకర్షక బుట్టలు, పక్షిస్థావరాల ఏర్పాటు ద్వారా చీడపీడలను నియంత్రించవచ్చని వివరించారు. ఏడీఏ కె.రామమోహన్ రెడ్డి ఆధునిక వ్యవసాయ పద్ధతుల ఆవశ్యకతను వివరించగా, మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి వేసవిలో లోతు దుక్కులు, పంట మార్పిడి, పసుపు, నీలిరంగు జిగురు అట్టల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఖేత్ బచావో అభియాన్‌పై వివరించి, క్షేత్రస్థాయిలో బత్తాయి, పచ్చిమిరప పంటలను పరిశీలిస్తూ చీడపీడల గుర్తింపు, నివారణ పద్ధతులను ప్రత్యక్షంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఎస్ కడప వ్యవసాయ అధికారిణి పి.పద్మజ, సీఐపీఎం అధికారులు బి.మోనిక, వై.మానస, ప్రకృతి వ్యవసాయ విభాగం, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పుస్తక ప్రదర్శన



పీలేరు, నవంబర్ 16, ప్రభాతవార్త:
పీలేరు ద్వితీయ శ్రేణి శాఖ గ్రంథాలయము నందు గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మూడవరోజు స్థానిక ఏవిఆర్ పాఠశాల విద్యార్థులచే పుస్తక ప్రదర్శన నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల నుంచి వయోవృద్ధుల వరకు అన్ని వర్గాల పాఠకులకు సంబంధించి పలు రకాల పుస్తకాలు కథలు, శీర్షికలు, నాటికలు, జనరల్ నాలెడ్జ్, పోటీ పరీక్ష పుస్తకములు, రామాయణ, మహాభారత పుస్తకములు, నవలలు ఇలా అనేక రకాల పుస్తకాలను విద్యార్థులు ఎంతో ఆసక్తిగా తిలకించడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కె.వి.ఆర్ పాఠశాల ఉపాధ్యాయులు టి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడమైనది ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అమరనాథ్ గ్రంథాలయ సహాయకులు డి వెంకటేష్ పాల్గొన్నారు.

శిశువుల ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు ఉషశ్రీ



పీలేరు, నవంబర్ 16
ప్రభాతవార్త:
చిన్నారుల మేలైన భవిష్యత్తు కోసం క్రమం తప్పని వైద్య సంరక్షణ చర్యలు మనందరి సామాజిక బాధ్యత అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఉషశ్రీ అన్నారు.నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణకై నిర్వహించే ప్రత్యేక వారోత్స వాల్లో బాగంగా, ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రి పీలేరులో వైద్యాధికారులు, సిబ్బందికి సూచనలు సలహాలతో పాటు, నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉషశ్రీ మాట్లాడుతూ సోమవారం నుంచి 21 వరకు నిర్వహించబోయే నవజాత శిశు వారోత్స వాల్లో భాగంగా, తక్కువ బరువుతో పుట్టిన శిశువులు, హై రిస్క్ పిల్లలు, మరియు ఆస్పత్రినుంచి ఇల్లు చేరిన ప్రతి బిడ్డకు నిరంతర ప్రత్యేక పరిరక్షణ సేవలు చేపట్టడం జరుగుతుందని, ప్రత్యేక సూక్ష్మ ప్రణాళిక వారిగా ఇంటింటి సర్వేలో పిల్లల యొక్క ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీసి నివారణచర్యలు చేపట్టడం జరుగుతుందని ఫలితంగా ఏ శిశువు మరణించడానికే జన్మించారాదని, డా. ఉషశ్రీ అధికారులకు మరియు సిబ్బందికి దిశ నిర్దేశం చేసి తర్వాత ఆసుపత్రిలో నవజాతి శిశువు వార్డులో పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించారు, శిశు సంరక్షణ అందరి బాధ్యత అంటూ నినాదాలు చేస్తూ నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో డాక్టర్ఉ షశ్రీ పాల్గొన్నారు. కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్య నిపుణులు వైద్యాధికారులు శివయ్య నాగవేని, పి.హెచ్.సి తలుపుల వైద్యఅధికారులు శ్రీ గిరీష, చంద్రశేఖర్ డిప్యూటి హెచ్ఇఒ కొండయ్య, పీహెచ్ఎన్ కుసుమ, శ్రీను, నాగమ్మ, ఏఎన్ఎంలు, సిహెచ్ఓలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి చదువుతోపాటు ఆటలుకూడా ముఖ్యం



బద్వేల్, నవంబర్ 16
ప్రభాతవార్త:
స్థానిక తెలుగులో కాలనీ ఉండే నారాయణ ఒలంపియాడ్ స్కూల్ నందు ఈ కిడ్జ్ విభాగానికి సంబంధించి (నారాయణ ప్రీమియర్ లీగ్) కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి చదువుతోపాటు ఆటలుకూడా ఎంతో ముఖ్యమని, నారాయణ విద్యా సంస్థలలో చిన్నప్పటినుండే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్నారులకు తల్లి దండ్రుల పర్యవేక్షణలోకొన్ని ఆటలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బద్వేల్ మున్సిపల్ కమిషనర్ యం. కృష్ణ విద్యార్థులను, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు స్వచ్ఛభారత్ అనే ఆట ఆడారు. ఆ ఆటలో విద్యార్థులు తడి చెత్తను, పొడి చెత్తను వేరు చేసి ఆడే ఆట సమాజానికి స్ఫూర్తిదాయకమని విద్యార్థులను ప్రశంసించారు. పాఠశాల ఏజీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడ ల్లో పాల్గొనడం వల్ల శరీరానికి చురుకుదనం, బలం, ఆరోగ్యం పెరుగుతాయని అలాగే ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, ఆలోచన శక్తి పెరుగుతాయని తెలిపారు. ప్రిన్సిపల్ రెడ్డి ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచినప్పుడే విద్యార్థుల సమగ్ర వికాసం సాధ్యమవుతుంది అన్నారు.ఈ కిడ్జ్ కోఆర్డినేటర్ స్వాతి మాట్లాడుతూ ఆటల వలన విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలన, జట్టుగా పనిచేయడం వంటి గొప్ప లక్షణాలు అలవాడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యం కృష్ణ, పాఠశాల ఏజీఎం శ్రీనివాసులు, ప్రిన్సిపల్ రెడ్డి ప్రవీణ్, ఈచామ్స్ కోఆర్డినేటర్ సరోజ,ఈ కిడ్జ్ కోఆర్డినేటర్ స్వాతి, సాఫ్ట్ స్కిల్ డిపార్ట్మెంట్ సంతోష్, అకాడమిక్ డీన్ నరసింహ, వైస్ ప్రిన్సిపల్స్ పావని, రాజేశ్వరి, అనూష, ఏ ఓ శ్రీనివాసులు, టెన్ట్ ఇంచార్జ్ అబ్దుల్ ఖాదర్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన శివ క్షేత్రాలు





సిద్ధవటం, నవంబర్16, ప్రభాతవార్త:
కార్తీక సోమవారం పురస్కరించుకొని మండలంలోని నిత్యపూజకోన, కబర్దీశ్వర, సిద్ధవటేశ్వర ఉమామహేశ్వర, సిద్ధవటేశ్వర శివాలయాల్లో మహిళలు వేకువజామునే చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు మండల కేంద్రమైన సిద్ధవటం పెన్నా నది ఒడ్డున వెలసిన సిద్ధ వటేశ్వర శివాలయంలో మొదటి సోమవారం సందర్భంగా, విశేషమైనటువంటి పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా మదనపల్లి, తెలుగు గంగ డిప్యూటీ కలెక్టర్, మాధవ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సిద్ధవటం శ్రీశైల దక్షిణ ముఖ ద్వారం మహా పుణ్యక్షేతం అని భక్తులు శివదర్శనానికి అధిక సంఖ్యలో పాల్గొనడం చాలా సంతోషకరమని పెన్నా నది పరిసర ప్రాంతాలలో ఎన్నో పవిత్రమైన ఆలయాలు ఉన్నాయని సిద్ధులు తపస్సు చేసిన సిద్ధవటం లో ఎన్నో ప్రఖ్యాతిగా గాంచిన శిల్పాలు, పరిసర ప్రాంతాల అటవీ ప్రాంతంలో అలనాటి శిల్పాలు పర్యాటకులకు ఆకట్టుకుంటున్నాయని ఇటువంటి గ్రామాన్ని రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగంగా తీర్చిదిద్ది అభివృద్ధి చేయాలని సూచించారు జ్యోతి శివ క్షేత్రంలో పురాతనమైన శివలింగాలు ఇసుక తవ్వకాల్లో బయటపడ్డాయని ఆలయాన్ని శ్రీశైలం దేవస్థానం వారు అభివృద్ధి చేయాలన్నారు ఆలయ సంప్రదాయాలతో డిప్యూటీ కలెక్టర్‌ను ఘనంగా సత్కరించి ఆలయ విశిష్ట తెలియజేశారు ఈ కార్యక్రమంలో శ్రీ సాయి హైస్కూల్ కరస్పాండెంట్ పోలు వెంకటసుబ్బయ్య, సుబ్బారెడ్డి యోగేశ్వర రెడ్డి, శ్రీనివాసులు రావు, సుబ్బారెడ్డి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలే ఆలంబనం

జాతీయ గ్రంథాలయ ఉద్యమకారులకు ఘన నివాళులు



పులివెందుల, నవంబర్ 16 ప్రభాతవార్త :
59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పులివెందుల పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ ఉద్యమానికి విశేష సేవలందించిన ప్రముఖులను స్మరించుకుంటూ నివాళులర్పించారు. గ్రంథాలయ ఉద్యమ పితామహులుగా గుర్తింపు పొందిన శ్రీ గాడిచర్ల హరి సర్వోత్తమరావు, శ్రీ అయ్యంకి వెంకట రమణయ్య, గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమ అభివృద్ధికి వారు చేసిన సేవలను, సమాజంలో పఠనాసక్తిని పెంపొందించేందుకు చేపట్టిన కృషిని గుర్తుచేసుకున్నారు. గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే కేంద్రాలుగా, విద్యార్థుల్లో పఠన అలవాట్లను పెంపొందించే వేదికలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానం, ఆలోచనా శక్తి, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయని, ప్రతి ఒక్కరూ గ్రంథాల యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కృష్ణ కిషోర్ రెడ్డి, లైబ్రరీ హెల్పర్ లక్ష్మీ నరసమ్మ, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొని జాతీయ గ్రంథాలయ ఉద్యమకా రులకు నివాళులు అర్పించారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



గాలివీడు. నవంబర్ 16,
ప్రభాతవార్త:
గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని గాలివీడు మండలంలోని బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) పాఠశాలల్లో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు గాలివీడు లైబ్రేరియన్ రామచంద్ర నాయక్ తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థినుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడం, సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం, విజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం లక్ష్యంగా పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. విద్యార్థినులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారని తెలిపారు.గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, భాషా పరిజ్ఞానం, క్రమశిక్షణ పెంపొందుతాయని రామచంద్ర నాయక్ వివరించారు. విద్యార్థులందరూ పాఠ్యపుస్తకాలతో పాటు విజ్ఞానాన్ని అందించే ఇతర పుస్తకాలను కూడా చదివే అలవాటు పెంపొందిం చుకోవాలని సూచించారు.

లక్కిరెడ్డిపల్లి మండలంలో 18 వార్డు నెంబర్లకు 67 నామినేషన్లు దాఖలు

లక్కిరెడ్డిపల్లి, నవంబర్ 16. ప్రభాతవార్త

లక్కిరెడ్డిపల్లె మండలంలోని పంచాయతీ వార్డు నెంబర్ల నామినేషన్లు సోమవారం 18 సర్పంచులు 68 వార్డు నెంబర్లు నామినేషన్లు దాఖలయ్యాయి. దిన్నెపాడు సర్పంచ్ (1) వార్డు మెంబర్లు (5), అప్ప కొండయ్య గారి పల్లి సర్పంచ్ (1) వార్డు నెంబర్లు (2),లక్కిరెడ్డిపల్లి సర్పంచ్ (1) వార్డు నెంబర్లు(12),బూదిదంటపల్లి సర్పంచ్ (1)), వార్డు నెంబర్ లేదు, అనంతపురం సర్పంచ్ (1) వార్డు నెంబర్ లేదు, కుర్నూతల సర్పంచ్ (1) వార్డు నెంబర్లు (8),కాకులవరం సర్పంచ్ (1) వార్డు మెంబర్లు (7), చౌటపల్లి సర్పంచ్ (1) వార్డు మెంబర్(2),కస్తూరి రాజు గారి పల్లి సర్పంచ్ (1) వార్డు నెంబర్లు (3), పందిళ్ళపల్లి సర్పంచ్ (1) వార్డు మెంబర్లు (10),కోనంపేట సర్పంచ్ (1) వార్డు నెంబర్ (1),పాలెం గొల్లపల్లి సర్పంచ్ (2) వార్డు మెంబర్లు (8),బి ఎర్రగుడి సర్పంచ్ (2) వార్డు నెంబర్(2),దప్పేపల్లి సర్పంచ్ (1) వార్డ్ మెంబర్ (2), రెండవ రోజు 18 సర్పంచులు 68 వార్డ్ మెంబర్లు నామినేషన్లు దాఖలయ్యాయని ఎంపీడీవో రెడ్డయ్య తెలిపారు.

పుట్టాయిపల్లె సర్పంచ్ అభ్యర్థులగా వంకెల శ్రీదేవి, పెద్దిరెడ్డి జ్యోతి నామినేషన్ దాఖలు



బద్వేల్ రూరల్, నవంబర్ 16 ప్రభాత వార్త:
బద్వేల్ మండలం పుట్టాయిపల్లె గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ తరఫున పెద్దిరెడ్డి జ్యోతి నామినేషన్ దాఖలు చేయగా, వైసీపీ తరఫున పవన్ కళ్యాణ్ చిన్న పోల్ రెడ్డి భార్య శ్రీదేవి లు నామినేషన్లు దాఖలు చేశారు.వీరు పుట్టాయిపల్లె గ్రామ సచివాలయంలో ఎన్నికల అధికారులకు తన నామినేషన్ పత్రాలను సమర్పించారు.

సంబేపల్లి మండలంలో రెండవ రోజు ప్రశాంతంగా నామినేషన్లు దాఖలు

సంబేపల్లి నవంబర్ 16 ప్రభాతవార్త

సంబేపల్లి మండల వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా రెండవ రోజు సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికల నామినేషన్ల ప్రశాంతంగా జరిగాయి మండల వ్యాప్తంగా రెండు రోజులకు కలిపి 214 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎంపీడీవో శివారెడ్డి తెలిపారు. అందులో సర్పంచులకు 65 నామినేషన్లు వార్డు సభ్యులకు149 నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు. రెండు రోజులకు కలిపి మొత్తం దేవపట్ల గ్రామానికి సర్పంచ్ 8 నాగిరెడ్డి గారి పల్లి గ్రామానికి సర్పంచ్ 8, రెడ్డివారి పల్లి గ్రామానికి సర్పంచ్కు 5 గున్నికుంట గ్రామ సర్పంచ్ ఒకటి గురిగింజ కుంట గ్రామ సర్పంచ్ కు 4 దుద్యాల గ్రామ సర్పంచ్కు ఒకటి నారాయణరెడ్డి పల్లి గ్రామం సర్పంచ్2 పీ ఎన్ కాలనీ గ్రా మం సర్పంచ్ ఒకటి దాఖలైనట్లు తెలిపారు. మోటాగట్ల గ్రామ సర్పంచుకు ఒకటి ఎస్ సోమవారం గ్రామ సర్పంచుకు3 గుట్టపల్లి గ్రామ సర్పంచ్కు3 సంబేపల్లి గ్రామ సర్పంచుకు7, రౌతు కుంట గ్రామ సర్పంచ్ కు 4 శెట్టిపల్లి గ్రామ సర్పంచ్ 4 అడవి కమ్మపల్లి గ్రామ సర్పంచ్ 6 పెద్ద బిడికి గ్రామ సర్పంచుకు3 సదిపిరి వానపల్లి సర్పంచ్కు4 నామినేషన్లు దాఖలు అయినట్లు తెలిపారు. నేడు నామినేషన్లకు చివరి ఒక్కరోజు మాత్రమే సమయం ఉన్నట్లు తెలిపారు.

సర్పంచ్ బరిలో చెంచయ్య నాయుడు



సిద్ధవటం, నవంబర్16, ప్రభాతవార్త:
పెద్దపల్లి, సర్పంచ్ స్థానానికి ఆదివారం చెంచయ్య నాయుడు నామినేషన్ దాఖలు చేశారు మండలంలోని పెద్దపల్లి గ్రామ సర్పంచ్ స్థానానికి కాడే చెంచయ్య నాయుడు, మాజీ సర్పంచ్ కేవీ సుబ్బయ్య మద్దతుతో మాధవరం క్లస్టర్ నందు నామినేషన్ దాఖలు చేశారు. మాజీ సర్పంచ్ కె.వి సుబ్బయ్య అందరికీ పరిచయగల వ్యక్తి రాజకీయాలలో ఆయన స్వార్థం కోసం ఎప్పుడు పని చేయలేదని మంచి వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నా రని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో, గాలివీడు మాజీ సర్పంచ్ శ్రీనివాసులు రాజు,మాజీ సర్పంచ్ కె.వి సుబ్బ య్య, ఎంపీటీసీ సభ్యురాలు, కాడే చిన్నక్క, సుబ్బరామిరెడ్డి, సుబ్బరాయుడు, గాలి సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూపీ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం

జమ్మలమడుగు, నవంబరు 16, ప్రభాతవార్త:
నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ముద్దనూరు రోడ్డులోని రెయిన్ బో వాటర్ ఫోర్క్ పక్కన ఉన్న వారాహి మినీ ఫంక్షన్ హాలులో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎన్ఎంయూపీ డిపో కమిటీ పేర్కొంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు రాష్ట్ర ఉపాధ్యక్షులు శివారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుధాకర్, కడప జోనల్ కార్యదర్శి శ్రీరామ్ నాయక్ హాజరవుతారన్నారు.

డైమండ్ జూబ్లీ మెమెంటో అందుకున్న శకుంతల

మదనపల్లెక్రైం, నవంబర్ 16 ప్రభాతవార్త.
అన్నమయ్య జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ లీడర్ ట్రైనర్ (గైడ్స్) డి. శకుంతల ప్రతిష్మాత్మకమైన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్ మెమెంటోను గవర్నర్ చేతుల మీదుగా అందుకోవడం పట్ల జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ కె. సుబ్రహ్మణ్యం, జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి ఆమెను అభినందించారు. యువతలో నిస్వార్థ సేవా భావం, దేశభక్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో ఆమె చేసిన కృషి అభినందనీయమని డీఈఓ డాక్టర్ కె. సుబ్రహ్మణ్యం కొనియాడారు. గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం అన్నమయ్య జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్‌కు ఎంతో గర్వకారణమని జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి తెలిపారు.

సేవా కార్యక్రమాలకు జాతీయ స్థాయి గుర్తింపు



ప్రొద్దుటూరు అర్బన్, నవంబరు 16, ప్రభాతవార్త:
పేదలు, నిరుపేదలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ప్రొద్దుటూరుకు చెందిన పోతిరెడ్డి ప్రకాష్ రెడ్డికి జాతీయ స్థాయి పురస్కారం లభించింది. గుంటూరులో ఆదివారం అఖిల భారత ఎన్జీవో వెల్ఫేర్ అసోసియేషన్, కె.వి.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 8వ సమాజ సేవకుల ఆత్మీయ సమ్మేళనంలో సూపర్ స్టార్ కృష్ణ పేరిట జాతీయ సేవా పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. ఫౌండేషన్ చైర్మన్ కొడవటికంటి బాల రాజు చేతుల మీదుగా ఈ పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అవార్డు అందించిన నిర్వాహకులకు, ఆల్ ఇండియా కృష్ణ మహేష్ ఫ్యాన్స్ ట్రస్ట్ గిద్దలూరు చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రొద్దుటూరులోని వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి. జయచంద్రారెడ్డి, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది ప్రకాష్ రెడ్డిని అభినందించారు. సమాజంలోని పేదలకు ప్రతి ఒక్కరూ తమవంతు సహాయం అందించాలని పిలుపునిచ్చారు.

అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శించిన బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి

గోపవరం. నవంబర్ 16.
ప్రభాతవార్త:
పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ వారి ఆహ్వానం మేరకు అయ్యప్ప స్వాములకు మండల కాలం అన్నవితరణ ప్రారంభం, కార్తీక సోమవారం సందర్భంగా బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి బద్వేల్ మున్సిపల్ చైర్ పర్సన్ డా. సోమేసుల దివ్య తేజ, వారి భర్త డా. క్రాంతి కుమార్‌తో కలిసి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించి తదుపరి జ్యోతి ప్రజ్వలన గావించి అన్న ప్రసాదం తయారీ కార్యక్ర మాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులతో కొద్దిసేపు మాట్లాడి ఆలయంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక పూజలు మరియు మండల కాలం మాలదారులకు భక్తులకు నిర్వహించే అన్న వితరణ కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, బద్వేల్ నియోజకవర్గం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో శ్రీ అయ్యప్ప స్వామి సేవా సంఘం అధ్యక్షులు సముద్రాల విజయకుమార్. ఉపాధ్యక్షులు వెంగళ జయసుబ్బారెడ్డి మరియు గుడి డైరెక్టర్లు కొప్పరపు ప్రభాకర్, అన్నపురెడ్డి రమణా రెడ్డి. ఆవుల మునయ్య, నల్లబల్లె వెంకటేశ్వర్లు. మరియు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కేదారేశ్వరస్వామి వ్రతం

పీలేరు, నవంబర్ 16
ప్రభవతవార్త:
స్థానిక శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం సోమవారంను పురస్కరించుకుని మహిళలు కేదారేశ్వరస్వామి వ్రతం భక్తి శ్రద్ధలతో చేపట్టారు. ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం పలువురు మహిళా భక్తులు ఆలయంలో కేశ్వరస్వామి వ్రతం చేపట్టి నోములు నోచుకున్నారు. నోము దారాలు ధరించారు. ఆలయ ప్రధాన అర్చకులు కుమారాస్వామి నోముల వ్రతం గూర్చి కథప చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు..

అంగరంగ వైభవంగా శ్రీశ్రీశ్రీ యల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన



పీలేరు నవంబర్ 16
ప్రభాతవార్త:
పీలేరు పట్టణంలోని చిత్తూరు రోడ్డులో సబ్ స్టేషన్ పక్కన నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ యల్లమ్మ దేవి ఆలయంలో యల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఆలయ చైర్మన్ దేవి రెడ్డి వెంకటరమణారెడ్డి, గీత సతీసమేతంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అర్చకులు శ్రీనివాస దీక్షితులు (పులిచెర్ల స్వామి) ఆధ్వర్యంలో వాస్తు పూజ, గణేష్ హోమం, చండీ హోమం, నవగ్రహాల హోమం తదితర పూజా కార్యక్రమాలు అనంతరం. ఆదివారం రాత్రి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, శ్రీ చక్ర యంత్రం ప్రతిష్ట, త్రిశూల స్థాపన, పోతురాజు విగ్రహ ప్రతిష్ట, జరిగింది సోమ వారం ఉదయ పూర్వం నుండి వేద పారాయణం, మండపార్చన, నాడీ సంధానం, విశేష ద్రవ్యములతో హోమం, దుర్గా హోమం, నక్షత్ర కళా హోమం, మహా ప్రాయశ్చిత్త హోమం, పూర్ణాహుతి, కుంభ ఉద్వాసన మహా కుంభాభిషేకం, మహాభిషేకం, విశేష అలంకారము, కుంకుమార్చన, అష్టావధాన సేవ, తదితర పూజా కార్యక్రమాలను భక్తి పార్వస్యంతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సతీ సమేతంగా డి. వెంకట రమణారెడ్డి గీత, ట్రస్టు బోర్డు సభ్యులు చంద్రారెడ్డి, పోతంశెట్టి రమేష్, శెట్టి సుబ్రమణ్యం, వంగిమల్ల రామచంద్ర, లాయర్ దినకర్, జ్ఞానంగారి శ్రీధర్, నాగరా

అన్నదాన కేంద్రం ప్రారంభోత్సవం



ఖాజీపేట నవంబర్ 16 ప్రభాతవార్త

ఖాజీపేట మండలం నందు ప్రసిద్ధి గాంచిన శ్రీ నాగనాదేశ్వరుని కోన దిగువన ఖాజీపేట వాకింగ్ బ్యాచ్ వారు దాతల సహకారంతో నిర్మించిన శ్రీ నాగనాదేశ్వర అన్నదాన సత్రాన్ని కార్తీకమాసం మొదట సోమవారం నాడు ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కుల మతాలకు అతీతంగా దాతల సహాయంతో దాదాపు 35 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ నాగనాదేశ్వర అన్నదాన సత్రం అందరిదీ అనీ ఈ అన్నదాన సత్రం ఏ ఒక్క కులానికి సంబందించినదో కాదు అని ప్రతి ఒక్కరూ ఇక్కడ అన్నప్రసాదాన్ని పొందవచ్చని తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు ప్రజల సహకారం అవసరం



ముద్దనూరు, నవంబర్ 16 ప్రభాతవార్త:

గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నగేష్ బాబు సూచించారు. మండల పరిధిలోని మంగపట్నం గ్రామ ఎస్సీ కాలనీలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న గ్రామపంచాయతీ సర్పంచ్ నామినేషన్ క్లస్టర్ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. కేంద్రం పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అవసరమైన భద్రతా ఏర్పాట్లపై పరిశీలన చేశారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమై ఎన్నికల నామినేషన్ ప్రక్రియ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, చట్టపరమైన నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, ఘర్షణలు, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని హితవు పలికారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. గ్రామంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని సీఐ నగేష్ బాబు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

సర్పంచ్ అభ్యర్థిగా రామ్మోహన్ రెడ్డి నామినేషన్



గోపవరం. నవంబర్ 16. ప్రభాతవార్త.

బద్వేల్ నియోజకవర్గ పరిధిలోని గోపవరం మండలం బేతాయపల్లి పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా రామ్మోహన్‌రెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలతో కలిసి నామినేషన్ కేంద్రానికి చేరుకుని రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. నామినేషన్ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక గ్రామస్థాయి నాయకులదే



తంబళ్లపల్లె నవంబర్ 16 ప్రభాతవార్త ఃఃః

గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి



ఖాజీపేట నవంబర్ 16 ప్రభాతవార్త

ఖాజీపేట శాఖా గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారులైన అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటాలకు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్(ఎస్సీ ఎస్టీ యాక్ట్)పుల్లగూర విష్ణువర్ధన్ పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ రాజుల కాలం, బ్రిటిష్ పాలనా కాలంలో గ్రంథాలయాలు ప్రజలకు అందుబాటులో లేకపోయాయని, వాటిని సామాన్య ప్రజలకు చేరవేయాలన్న లక్ష్యంతో గాడిచర్ల సర్వోత్తమరావు, ఎస్.ఆర్. రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం తదితరులు చేసిన కృషి ఫలితంగా నేడు ప్రతి గ్రామంలో గ్రంథాలయాలు వెలిశాయని పేర్కొన్నారు. వారి జీవిత చరిత్రను పాఠకులకు వివరించారు.కార్యక్రమంలో మండల గ్రంథాలయం అధికారి కే.హరికృష్ణ , బి డి సి నిర్వాహకులు వీర నరేష్, పి.వెంకట రవి,పాఠకులు జగన్, సి.సుబ్బయ్య, పి .లక్ష్మీ నారాయణ, పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ
ఎన్నికల విధులకు అధికారుల నియామకం

5 క్లస్టర్ గ్రామ పంచాయతీలకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు

డిసెంబర్ 2న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు

ముద్దనూరు, నవంబర్ 16 (ప్రభాతవార్త):



2026 గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముద్దనూరు మండల పరిధిలోని ఐదు క్లస్టర్ గ్రామ పంచాయతీలకు రిటర్నింగ్ అధికారులు (స్టేజ్।, ।।), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ వైఎస్ఆర్ కడప జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ముద్దనూరు ఎంపీడీవో రాధాకృష్ణవేణి తెలిపారు. సోమవారం ఆమె పత్రికలకు వెల్లడించిన వివరాల ప్రకారం పెనికలపాడు, ముద్దనూరు, మంగపట్నం, చింతకుంట, నల్లబల్లి క్లస్టర్ గ్రామ పంచాయతీలకు అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. నియమితులైన అధికారులకు నవంబర్ 16వ తేదీ ఉదయం 9 గంటలకు కడప జెడ్పీ కాంపౌండ్‌లోని డీపీఆర్సీ భవనంలో శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారని, అదే వేదిక వద్ద పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 2వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నట్లు వివరించారు. ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, సిబ్బంది విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సూచించారు. ఎవరైనా ఎన్నికల విధులకు గైర్హాజరైతే ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం1994 ప్రకారం కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల్లో స్పష్టం చేసినట్లు ఎంపీడీవో రాధాకృష్ణవేణి వెల్లడించారు.

ఎంపీపీ ఎన్నికకు ఏర్పాట్లు ముమ్మరం

తంబళ్లపల్లె నవంబర్ 16 ప్రభాతవార్త ఃఃః